హత్య ! ప్రమాదమా !

- అంత్యక్రియల అడ్డగింత
- మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించిన పోలీసులు

కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న సీఐ రమేశ్

కౌటాల, మార్చి 12 : మండలంలోని గుండాయిపేటలో దుర్గం కారు(60) అనే వృద్ధుడి మృతి అనుమానాస్పదంగా మారింది. కారు సోమవారం రాత్రి ఇంట్లో పడి గాయాలై మృతి చెందినట్లు కుటుంబసభ్యులు మంగళవారం అంత్యక్రియలు చేసేందుకు సిద్ధమయ్యారు. కౌటాల పోలీసులు మృతుడి ఇంటికి వెళ్లి అంత్యక్రియలను అడ్డుకున్నారు. వృద్ధుడి కొడుకులే కొట్టి చంపినట్లు పోలీసులకు సమాచారం అందడంతో కౌటాల సీఐ ముత్యం రమేశ్ పోలీసులతో అక్కడికి చేరుకుని కుటుంబసభ్యులను విచారించారు. కుటుంబంలోని వారు చెప్పే మాటల్లో పలు అనుమానాలు రావడంతో శవాన్ని పోస్టు మార్టం కోసం తరలించేందుకు పోలీసులు సిద్ధం కాగా కుటుంబసభ్యులు, బంధువులు నిరాకరించారు. దీంతో రెవెన్యూ అధికారుల సహకారంతో పోలీసులు మంగళవారం సాయంత్రం శవాన్ని పోస్టుమార్టానికి సిర్పూర్ (టీ) సామాజిక దవాఖానకు తరలించారు. ఈ విషయంపై కౌటాల ఎస్ఐ మధుకర్‌ను వివరణ కోరగా వృద్ధుడు ఇంటిలో వెనుకకు పడిపోవడంతో తలకు గాయమై మృతి చెందినట్లు మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదులో ఉందని, కానీ పోలీసులకు అందిన సమాచారం మేరకు అనుమానాస్పద మృతిగా గుర్తించి పోస్టుమార్టానికి పంపినట్లు, పోస్టు మార్టం రిపోర్టు వచ్చిన వెంటనే మృతికి గల కారణాలు తెలుస్తాయని తెలిపారు.

బావిలో పడి యువకుడి మృతి

కౌటాల, మార్చి 12 : కౌటాల మండలం మొగడ్ధగడ్ గ్రామానికి చెందిన ఉర్వత్ దౌలత్ (26) గ్రామ శివారులోని లిఫ్ట్ ఇరిగేషన్ నీళ్లు లేని బావిలో పడి బుధవారం మృతి చెందాడు. దౌలత్ గత కాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నట్లు, ఇదే క్రమంలో లిఫ్ట్ ఇరిగేషన్ బావిలో పడి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడి తల్లి నిర్మలాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా మద్యం రవాణా చేస్తే కఠిన చర్యలు

పట్టుకున్న దేశీదారు బాటిళ్లు

వాంకిడి, మార్చి 12: అక్రమ మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆసిఫాబాద్ ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ రమేశ్ అన్నారు. బుధవారం మహారాష్ట్ర చంద్రపూర్ నుంచి బస్సులో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని వాంకిడి మండలంలోని గోయగాం వద్ద పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ తెలిపారు. జిల్లా సూపరింటెండెంట్ జ్యోతి కిరణ్ ఆదేశాల మేరకు తనిఖీ చేశారు. మహారాష్ట్ర చంద్రపూర్ నుంచి గడ్చిరోలి జిల్లా సిరొంచకు తరలిస్తున్న దాదాపు రూ.58,970 విలువగల మద్యం స్వాధీనం చేసుకొని గడ్చిరోలి జిల్లా అమరావతికి చెందిన తిరుమల్ బానయ్య కుమ్మరి, జ్యోతి దినేశ్ కుంభారే, సుమలత కిష్టయ్య సోదరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుళ్లు ధనరాజ్, రజిత తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

- దవాఖానకు తరలించిన డీసీపీ

మహిళను ఆటోలో ఎక్కిస్తున్న డీసీపీ భాస్కర్

హాజీపూర్, మార్చి 12 : మండలంలోని వేంపల్లి గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు గాయాలు కాగా మంచిర్యాల డీసీపీ భాస్కర్ ఆటోలో దవాఖానకు తరలించారు. బుధవారం రాత్రి మంచిర్యాల నుంచి లక్షెట్టిపేట వైపు వెళ్తున్న డీసీపీ వేంపల్లి గ్రామ వద్దకు వచ్చే సరికి ఓ ఆటో మహిళను ఢీ కొట్టి వెళ్లింది. రోడ్డుపై పడి ఉన్న మహిళను మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. డీసీపీ స్పందించిన తీరుపై వాహనదారులు, ప్రజలు అభినందించారు.

తాత్కాలిక రిజిస్ట్రేషన్లను నిలిపివేసిన అధికారులు

చెన్నూర్ రూరల్, మార్చి 12: జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లలో తాత్కాలిక రిజిస్ట్రేషన్లను (టీఆర్ రిజిష్ట్రషన్లు)ను నిలిపివేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి యామిని బుధవారం తెలిపారు. చెన్నూర్‌మండలంలోని రైతులు పత్తి డాటా లేదని వ్యవసాయ శాఖ కార్యాలయానికి వచ్చి కౌలు రైతుల పేర్ల మీద రాసి ఇవ్వాలని ఏఈవోలను అడుగుతున్నారని, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లలో తాత్కాలిక రిజిష్ట్రన్లను నిలిపివేశారని, ఇందులో భాగంగా కౌలు రైతులకు రాసి ఇవ్వడం కూడా నిలిపివేసినట్లు ఆమె తెలిపారు.

నక్కలపల్లికి బస్సు నడపండి

కోటపల్లి, మార్చి 12 : కోటపల్లి మండలం నక్కలపల్లికి ఆర్టీసీ బస్సు నడపాలని బీజేపీ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, నాయకులు ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. రోడ్డు సరిగా లేని కాలంలో నక్కలపల్లి మీదుగా బద్దంపల్లి, చామనపల్లి వరకు బస్సు నడిచిందని, రోడ్డు బాగయినప్పటికీ బస్సు నడపడం లేదని, ఇక్కడ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి భూమి పూజ

మందమర్రి, మార్చి 12 : సింగరేణి పాఠశాల మైదానంలో సింగరేణి యాజమాన్యం నూతనంగా నిర్మించబోయే వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, సింగరేణి సివిల్ ఇంజినీర్ జయప్రకాశ్ హాజరై పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ భీమనాథుని సుదర్శన్, సివిల్ అధికారి రాకేశ్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ శివ, గ్రౌండ్ ఇన్‌చార్జి తిరుపతి, కాంట్రాక్టర్ సమ్మయ్య, అసోసియేషన్ సభ్యులు గురుప్రసాద్ పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

మందమర్రి, మార్చి 12: మున్సిపాలిటీ పరిధిలోని జడ్పీఎస్ ఓర్రెగడ్డ ప్రభుత్వ పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు ప్రజాసేవా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ అజిముద్దీన్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, స్కెళ్లు బుధవారం పంపిణీ చేశారు. సొసైటీ నిర్వాహకులను ఎస్ఐ రాజశేఖర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ పద్మావతి, ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు సుద్దాల ప్రభుదేవ్, పట్టణ అధ్యక్షుడు నంది పాటరాజు, శంకర్, దాడి రాజు, ఎండీ జావిద్ పాషా, రవీందర్, నాగరాజు, చరణ్ పాల్గొన్నారు.

భట్టుపల్లిలో..

కాగజ్‌నగర్ రూరల్, మార్చి 12: కాగజ్‌నగర్ మండలంలోని భట్టుపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ సెకండరి పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు మంచిర్యాల కేతన్‌పల్లి నివాసి గొళ్లపల్లి మంహేందర్ ఆధ్వర్యంలో ఉచితంగా ఎగ్జామ్ ప్యాడ్‌లు పంపిణీ చేశారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



దండేపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

దండేపల్లి, మార్చి12: జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం నగునూరులో అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండలు వేసిన దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ దండేపల్లిలో బుధవారం మాలమహానాడు సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేంచంద్, మాల మహానాడు మండల అధ్యక్షుడు మాడ దయాకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండ రాకేశ్, మోహన్‌దాస్, వెంకటేశ్, వసంత్, పెద్దయ్య, సూరయ్య, స్వస్తిక్, తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

వేమనపల్లి, మార్చి 12 : మండలంలోని నీల్వాయి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఎంపీడీవో కుమారస్వామి పరిశీలించారు. గరిష్ట వేతనం రూ. 300 పొందేలా పనులను చేయాలని సూచించారు. అనంతరం గొర్లపల్లి, వేమనపల్లి, క్యాతనపల్లి, రాజారాం గ్రామాల్లో జరుగుతున్న పాఠశాలల కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో సత్య ప్రసాద్, ఈసీ మధుకర్, పంచాయతీ కార్యదర్శులు అశోక్, సాయి, జాఫర్,పోశం, టీఏలు కృష్ణమోహన్, లక్ష్మణ్, శ్రీనివాస్, క్షేత్ర సహాయకులు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

హాజీపూర్, మార్చి 12: మండలంలోని కర్ణమామిడిలో ఈజీఎస్ పనులను మండల ప్రత్యేక అధికారి, డీఆర్డీవో కిషన్ బుధవారం పరిశీలించారు. అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సంబంధిత ఎంపీడీవో, ఏపీవో పీఎస్‌లు ఉన్నారు

బాల్య వివాహాల నిర్మూలనపై కళాజాత

దహెగాం, మార్చి12: మండలంలోని కొంచవెల్లిలో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించినట్లు ఎస్ఐ కందూరి రాజు తెలిపారు. సైబర్ నేరాలు, గంజాయి, తదితర అసాంఘిక కార్యకలాపాలపై అవగాహన కల్పించారు. ఏఎస్ఐ ప్రకాశ్, కళాజాత బృందం సభ్యులు రాంచందర్, రోహిత్, చంద్రశేఖర్, శ్రీనివాస్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై వరకట్న వేధింపుల కేసు నమోదు

మంచిర్యాల అర్బన్, మార్చి 12 : కుమ్రం భీం జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన ముత్యాల రాంప్రసాద్‌తో పాటు ఆయన సోదరి సరోజనపై వరకట్న వేధింపుల కేసు నమోదైనట్లు మంచిర్యాల పట్టణ మహిళా పోలీస్ స్టేషన్ సీఐ నరేశ్ కుమార్ తెలిపారు. మంగళవారం సీఐ తెలిపిన వివరాల ప్రకారం రాంప్రసాద్ కాగజ్‌నగర్‌లో ఏఈగా ఉద్యోగం చేస్తున్నాడు. 2011లో మంచిర్యాల హమాలీవాడకు చెందిన స్వాతితో రూ.15లక్షల కట్నం, 10 తులాల బంగారు ఆభరణాలు, సుమారు రూ.2 లక్షల విలువైన ఇంటి సామగ్రి ఇచ్చి కుటుంబ సభ్యులు వివాహం జరిపించారు. పాప, బాబు జన్మించిన తర్వాత అదనపు కట్నం కోసం భార్య స్వాతిని భర్త రాంప్రసాద్, ఆడపడుచు సరోజన కలిసి వేధిస్తున్నట్లు దాంతో పాటుగా ఇతర అమ్మాయిలతో అక్రమ సంబంధం పెట్టుకొని భార్యను హింసించేవాడని తెలిపారు. గతంలో ఇచ్చిన పోలీస్ కౌన్సెలింగ్‌లో సైతం మారుతానని రాతపూర్వకంగా రాసి ఇచ్చాడని, అయినా మారకుండా తీవ్రంగా కొట్టి దవాఖానల పాలు చేసేవాడని తన భార్య ముత్యాల స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

బాడీ బిల్డింగ్ పోటీల విజేతలకు సన్మానం

నస్పూర్, మార్చి 12 : తెలంగాణ బాడీ బిల్డింగ్ అసోసియేషన్, మంచిర్యాల బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నస్పూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన జూనియర్, సీనియర్, మాస్టర్ డిస్ట్రిక్ బాడీ చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన బాడీ బిల్డర్లను బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చాంపియన్‌జిమ్‌లో ఘనంగా సన్మానించారు. మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన పలువురు బాడీ బిల్డర్లు పాల్గొనగా మంచిర్యాల చాంపియన్ జిమ్‌లో శిక్షణ పొందుతున్న 11 మంది బాడీ బిల్డర్లు విజేతలుగా నిలిచారు. మిస్టర్ ఆదిలాబాద్, మిస్టర్ మంచిర్యాలగానే కాకుండా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన చాంపియన్స్ ఆఫ్ చాంపియన్స్ విభాగంలో పాత మంచిర్యాలకు చెందిన మాసు వెంకటేశ్ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచాడు. మాసు వెంకటేశ్‌తో పాటు ముడిమడగుల శ్రీనివాస్, విశ్వనాథ్, శ్యామ్, ప్రదీప్‌కుమార్, శివకుమార్, మల్లన్న, శశాంక్,మధు, కుమార్, భీమన్న వివిధ కేటగిరీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజయం సాధించగా వీరిని కూడా శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిమ్ వ్యవస్థాపకుడు సుదర్శన్‌గౌడ్, జిమ్ యజమాని, కోచ్ కొయ్యడ విద్యాసాగర్‌గౌడ్, జిమ్ సభ్యులు జక్కన్న, మల్లేశ్, మధు, ఆరీఫ్, సతీశ్, నాగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఉన్నత స్థాయికి ఎదగాలి

- సీనియర్ సివిల్ జడ్జి యువరాజ

స్పోర్ట్స్ ట్రాక్ షూట్ ను అందజేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి యువరాజ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మార్చి 12: మొట్టమొదటి డాక్టర్ ఆనందిబాయి, ఐపీఎస్ అధికారిని కిరణ్ బేడీ, శాస్త్రవేత్త కల్పనా చావ్లా లాంటి వారిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆసిఫాబాద్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి యువరాజ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వివిధ పోటీల్లో అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన పులిశెట్టి శృతి, వర్ష, మాడావి కరినాను సన్మానించారు. విద్యార్థులు పతకాలు సాధించేలా కృషి చేస్తున్న హ్యాండ్‌బాల్ కోచ్ ఉమ్మడి జిల్లా రెఫ్రీ బోర్డు చైర్మన్ చునార్కార్ అరవింద్‌ను ఫుట్ బాల్ కోచ్ రవి సాగర్, ఖోఖో కోచ్ తిరుమలను అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి కనపర్తి రమేశ్, గిరిజన క్రీడల అధికారి బండ మీనా రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగు, అథ్లెట్లు సాగర్, కోచ్ సాయి, హాఫిజ్ ఉన్నారు.

ఎల్ ఆర్ఎస్ రాయితీ సద్వినియోగం చేసుకోవాలి

- ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

డైరీ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

కాగజ్‌నగర్, మార్చి 12: ప్రభుత్వం కల్పిస్తున్న ఎల్ఆర్ఎస్ రాయితీ సద్వినియోగం చేసుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. కాగజ్‌నగర్‌లోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎల్ఆర్ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకునేలా పట్టణ ప్రజలకు, ప్లాట్ల యజమానులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆస్తి పన్ను వసూలు లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో రూ.3.94 కోట్లకు గాను రూ. 2.08 కోట్లను వసూలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ అంజయ్య తెలిపారు. అనంతరం మున్సిపల్ యూనియన్ సెంట్రల్ ఫోరం డైరీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ క్రాంతి, టీపీవో యశ్వంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య నివారణకు చర్యలు తీసుకోవాలి

- మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్

రికార్డులను తనిఖీ చేస్తున్న డీసీపీ భాస్కర్

బెల్లంపల్లి, మార్చి 12 : పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ ఆదేశించారు. బెల్లంపల్లిలోని వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం రాత్రి మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ తనిఖీ చేశారు. నమోదైన కేసుల వివరాలతో పాటు పోలీస్‌స్టేషన్ నిర్వహణ, విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణ కోసం చేపడుతున్న చర్యలు, రౌడీషీటర్ల బైండోవర్లు, కౌన్సెలింగ్ విషయాలపై చర్చించారు. పోలీస్‌స్టేషన్‌లో రిసెప్షనిస్ట్ సిబ్బందికి తగు సలహాలు, సూచనలు చేశారు. పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి కాంటా చౌరస్తా వరకు బజార్ ఏరియాలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయనతో పాటు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య ఉన్నారు.

నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

మంచిర్యాల (ఏసీసీ), మార్చి 12: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ ఉత్తీర్ణులైన బీసీ అభ్యర్థులకు బ్యాంకింగ్, ఫైనాన్స్ లో ఉచిత శిక్షణ అందించి ఉద్యోగ అవకాశం కల్పించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ.పురుషోత్తం నాయక్, ఆదిలాబాద్ బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు జీ ప్రవీణ్ కుమార్ బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్, ఫైనాన్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా ఒక నెల నాన్ రెసిడెన్షియల్ ఫ్రీ ట్రైనింగ్ నిర్వహిస్తామని, శిక్షణ పూర్తయిన తర్వాత ప్రైవేట్ బ్యాంకుల్లో ఉద్యోగ అవకాశం కల్పిస్తామని తెలిపారు. డిగ్రీ పూర్తయి 26 యేళ్ల లోపు వయసున్న అభ్యర్థులు ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు ఆన్లైన్లో www.tgbcstudycircle. cgg.gov.in వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన అభ్యర్థులకు ఏప్రిల్ 12వ తేదీన ఆన్లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ఉమ్మడి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తామని తెలిపారు. అభ్యర్థుల తల్లిదండ్రుల ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 2 లక్షల రూపాయల లోపు ఉండాలని, ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్టులో వచ్చిన మార్కుల ఆధారంగా 30 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. వివరాలకు 08732-221280 నంబర్లో సంప్రదించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

బీట్ ఆఫీసర్‌పై ఉపాధి హామీ కూలీల ఫిర్యాదు

కాగజ్‌నగర్, మార్చి 12: భట్టుపల్లికి చెందిన ఉపాధిహామీ కూలీలు అటవీ శాఖ బీట్ ఆఫీసర్ రవిపై బుధవారం కాగజ్‌నగర్ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉపాధి హామీ కూలీలు తెలిపిన వివరాల ప్రకారం దరిగాం చెక్ పోస్టు కెనాల్‌లో సమీపంలో ఉపాధిహామీ పని కల్పించారని, ఆ ప్రదేశంలో మహిళలు పని చేస్తుండగా అక్కడికి చేరుకున్న బీట్ ఆఫీసర్ రవి మహిళలపై కూడా దురుసుగా ప్రవర్తించి వాహనాల తాళాలు లాక్కున్నారని, ఇక్కడ పని చేస్తే కేసులు పెడతానని బెదిరించాడని పేర్కొన్నారు. కూలీలు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సందీప్ తెలిపారు.

ఇంటి పన్ను వంద శాతం వసూలు చేయాలి

- డీపీవో వెంకటేశ్వరరావు

సెగ్రిగేషన్ పనులను పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు

బెల్లంపల్లి, మార్చి 12 : మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటి పన్నులు వంద శాతం వసూలయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. తాండూర్ మండలంలోని కిష్టంపేట, తాండూర్, రాజీవ్ నగర్ గ్రామ పంచాయతీలను బుధవారం ఆయన సందర్శించారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను దగ్గరుండి పరిశీలించారు. గ్రామపంచాయతీల రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని తెలిపారు. నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్డుల పనితీరును పర్యవేక్షించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించాలని సిబ్బందికి సూచించారు. ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు లేకుండా సేకరించి సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించాలని చెప్పారు. పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని ఆదేశించారు. ఆయనతో పాటు ఎంపీవో జీ అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు ఎం.ఉదయ్ కుమార్, డీ దివాకర్, రమాదేవి పాల్గొన్నారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

రౌడీ షీటర్లతో మాట్లాడుతున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి, మార్చి 12 : రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. బెల్లంపల్లి రూరల్ సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లకు బుధవారం సీఐ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దని సూచించారు. భూ సెటిల్‌మెంట్లు, పంచాయతీలు చేయవద్దని తెలిపారు. భవిష్యత్‌లో ఎలాంటి నేరాలకు పాల్పడవద్దని సూచించారు. నేర ప్రవృత్తి మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐ అష్టలుద్దీన్, రూరల్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం

వాంకిడి, మార్చి 12: వాంకిడి మండల ఎంఈవోగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన రాథోడ్ మనుకుమార్, నోడల్ అధికారి రాథోడ్ సుభాష్, ఉద్యోగోన్నతిపై వెళ్లిన వెంకట రాజయ్యను వాంకిడి మండల ఉపాధ్యాయులు, మండల విద్యా వనరుల కేంద్ర సిబ్బంది బుధవారం వాంకిడి ఎమ్మార్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. మండలంలో విద్యాభివృద్ధికి వారు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత ఎంఈవో శివ చరన్ కుమార్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నటరాజ్, ప్రబోధ్ కుమార్, వెంకట రాజయ్య, మండల ఉపాధ్యాయులు ధర్మ బాయి, రాధ మౌనిక, రవళి చైతన్య, శివ, సాయి కుమార్, మహేందర్, విద్యా వనరుల కేంద్ర సిబ్బంది తిరుమల తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతే లక్ష్యం

- 'పోలీసులు మీ కోసం'లో కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు
- జైనూర్‌లో మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు

వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలు

జైనూర్, మార్చి 12 : ప్రజల భద్రతే లక్ష్యమని, ఈ మేరకు 'పోలీసులు మీ కోసం' లో భాగంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు అన్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలో పోలీసులు మీ కోసంలో భాగంగా కరీంనగర్ ప్రతిమ దవాఖాన వారి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆదివాసులకు మెరుగైన వైద్య అందించాలనే ఉద్దేశంతో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్య, వైద్యం అందుబాటులో ఉంటే ఈ ప్రాంతంలో అభివృద్ధి చెందుతుందన్నారు. వ్యసనాలకు విద్యార్థులు దూరంగా కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. గంజాయి సాగు చేసినా, రవాణా చేసినా వినియోగించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తుల మాయ మాటలు విని మోసపోవద్దని, అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలతో మమేకం అయ్యేందుకు బాధ్యతగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో సమస్యలుంటే పోలీసులకు తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ క్యాంపులో వైద్యులు కౌశిక్, గీతారెడ్డి, అవినాష్ కుమార్, విశ్వంత్, శ్రావణ్ కుమార్, రవీణ, రోషన్‌రాజ్ పాల్గొని 300 మందికి ఈసీజీ, 2డీ ఇకో, అల్ట్రా సౌండ్ స్కానింగ్, మొదలగు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుమ్మెత విశ్వనాథ్, సహకార సంఘం చైర్మన్ కొడప హన్నుపటేల్, సీఐ.ఈ రమేశ్, ఎస్ఐ.డీ సాగర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్, ఎస్ఐలు గంగన్న, రామకృష్ణ, నాయకులు మెస్రం అంబాజీరావ్,